ANN తెలుగు

REGISTERED NUMBER:
APTEL/2014/58382

15-08-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 252 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM




## స్వాతంత్ర్యం దేశ ఆత్మగౌరవానికి ప్రతీక.. దాన్ని కాపాడడం ప్రతీ పౌరుని బాధ్యత

- మహా పత్రిక పాఠకులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

**టాప్ న్యూస్**

### తెలుగు చిత్రపరిశ్రమలో ఎవరి కుంపటి వారిదే



- అల్లు అరవింద్ సంచలన వ్యాఖ్యలు
- జాతీయ అవార్డులొచ్చినా పండుగేదీ?

02

### పులివెందులలో పసుపు జెండా



- వైనాట్ కుప్పంకు రివేంజ్ తీర్చుకున్న లోకేష్
- టీడీపీ ఖాతాలోకి జడ్పీటీసీలు

02

### హైకోర్టులో పెద్దమ్మతల్లి

- కూల్చివేతపై.. పూర్తి వివరాలు ఇవ్వండి
- పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని జాగ్రత్తగా భద్రపరచాలి
- ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ
- తదుపరి విచారణ 18కి వాయిదా



02



# దృఢమైన విశ్వాసంతో భారత్ ముందుకు

### 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

ప్రపంచంలోని అత్యంత వేగంగా ఆర్థిక అభివృద్ధి

జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**ఢిల్లీ, మహా:** స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తున్నాయని తెలిపారు. పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్' ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. 'పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. మనల్ని విభజించాలనుకునే వారికి దీటైన జవాబు ఇచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు గుణపాఠం నేర్పింది.

మిగతా 2లో



# రాహుల్ సంచలన పాదయాత్ర

### ఇది కాంగ్రెస్‌కు డూ ఆర్ డై

బీహార్ లో ఆగస్టు 17 నుండి శ్రీకారం

సెప్టెంబర్ 1 దాకా పాదయాత్ర కొనసాగింపు

ఓట్ చోరీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

ఇండియా కూటమి నాయకులతో కలిసి ఓట్ అధికారయాత్ర

అక్టోబర్ 15 దాకా వరుస కార్యక్రమాలు

02

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ చోరీపై గళమెత్తుతూ.. సంచలన పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఓట్ చోరీ అనేది కాంగ్రెస్ పార్టీకి డూ ఆర్ డై సమస్య అని, ఈ పోరాటంలో తగ్గేదెలే అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఓటర్ల జాబితాలో లోపాలపై ఈసీ, అధికార బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరింత దూకుడు పెంచారు. బీహార్ 'ఓట్ అధికార్ యాత్ర'ను చేపట్టేందుకు డిసైడ్ అయ్యారు. - మహా, ఢిల్లీ



# ఓట్ల దొంగలు.. గద్దెదిగండి

కాంగ్రెస్ శ్రేణుల క్యాండిల్ ర్యాలీలు..

ఖమ్మం ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఓటర్ల తొలగింపుపై సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

02

### గోల్డ్ రన్

- తులం లక్ష దాటినా అదే దూకుడు
- తెలుగురాష్ట్రాల్లో ఏటా రూ.50వేల కోట్లకు పైనే వ్యాపారం
- శ్రావణమాసంలో కొనుగోళ్ళ కళ
- ట్రంప్ టారిఫ్స్ ఎఫెక్ట్ తో పెరుగుతున్న ధరలు

02




SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,01,400 |
| 22 క్యారెట్ | 92,950 |
| సిల్వర్ (కేజీ) | 1,15,000 |


## పులివెందులలో పసుపుజెండా

వైనాట్ కుప్పంకు రివేంజ్ తీర్చుకున్న లోకేష్

టీడీపీ ఖాతాలోకి జడ్పీటీసీలు

**మహా:** పులివెందులలో పసుపుజెండా ఎగిరింది. జడ్పీటీసీ ఉప ఎన్నికలలో టీడీపీ సవాల్ చేసి విక్టరీ సాధించింది. వైనాట్ కుప్పం అంటూ తాను అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబును దిగ్బంధించేందుకు జగన్ ప్రయత్నించగా, ఇపుడు వైనాట్ పులివెందుల అంటూ యువమంత్రి లోకేష్ సింపుల్‌గా పసుపుజెండా ఎగరేశారు. ఎన్నిక జరిగిన తీరుపై ఆరోపణలు, ఆక్షేపణలు వ్యక్తం చేస్తూ వైసీపీ నేతలు మీడియా సమావేశాలు పెడుతుండగా, గతంలో వారు మాట్లాడిన మాటలతోనే టీడీపీ నేతలు కౌంటర్లు ఇస్తున్నారు. లోకేష్ నాయకత్వ పటిమకు, పట్టుదలకు ఈ విజయం నిదర్శనమని టీడీపీ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజేతలకు నేరుగా ఫోన్ చేసి నారా భువనేశ్వరి అభినందనలు తెలిపారు. వైఎస్ జగన్‌కు సొంత నియోజకవర్గంలోనే షాకిచ్చామన్న ఆనందంలో టీడీపీ వర్గాలున్నాయి.

# రాహుల్ సంచలన పాదయాత్ర



**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ చోరీపై గళమెత్తుతూ.. సంచలన పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఓట్ చోరీ అనేది కాంగ్రెస్ పార్టీకి డూ ఆర్ డై సమస్య అని, ఈ పోరాటంలో తగ్గేదెలే అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఓటర్ల జాబితాలో లోపాలపై ఈసీ, అధికార బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరింత దూకుడు పెంచారు. బీహార్ 'ఓట్ అధికార్ యాత్ర'ను చేపట్టేందుకు డిసైడ్ అయ్యారు. ఓటర్ల జాబితాల సవరణ, ఓటు చోరీకి వ్యతిరేకంగా తాను చేస్తున్న పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రణాళికలు వేశారు. ఈ క్రమంలో బీహార్‌లోని ఇండియా కూటమి నాయకులతో కలిసి రాహుల్ గాంధీ ఆగస్టు 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ఓట్ అధికార్ యాత్ర' చేపట్టనున్నారు. బీహార్ అంతటా ఓటు అధికార్ యాత్రను చేపడతారని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. "ప్రమాదకరమైన ఎస్ఐఆర్, ఓటు చోరీకి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రజా ఉద్యమంగా మార్చడానికి ఈ యాత్ర. యాత్రకు సన్నాహాలు, జన సమీకరణ వంటి ఏర్పాట్లపై చర్చించేందుకు బుధవారం ససారంలో ఇండియా బ్లాక్ నాయకులను కలిశాను. ఓటు అధికార్ యాత్ర సెప్టెంబర్ 1న పట్నాలోని గాంధీ మైదానంలో జరిగే ర్యాలీతో ముగుస్తుంది" అని కేసీ వేణుగోపాల్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

**ఇది మాకు డూఆర్ డై సమస్య**

ఓటు చోరీ అనేది తమకు డూ ఆర్ డై సమస్య అని కాంగ్రెస్ పార్టీ మంగళవారం పేర్కొంది. ఆగస్టు 14 సాయంత్రం 'లోక్ తంత్ర బచావో మషాల్ మార్చ్‌లు'తో సహా వివిధ కార్యకలాపాల ద్వారా ఓటు చోరీపై తమ గొంతుకను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఒక రోడ్ మ్యాప్‌ను ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్ ఛార్జ్ లతో సమావేశం అనంతరం కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓటు చోరీ, ఎస్ఐఆర్ ను మూడు ముఖ్యమైన కార్యక్రమాలతో ప్రజల్లోకి తీసుకెళ్తుందని హస్తం పార్టీ నాయకుడు కన్హయ్య కుమార్ తెలిపారు. "ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు, అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలలో 'లోక్ తంత్ర బచావో మషాల్ మార్చ్' జరుగుతుంది. ఆగస్టు 22 సెప్టెంబర్ 7 మధ్య అన్ని రాష్ట్ర ప్రధాన కార్యాలయాలలో కాంగ్రెస్ 'ఓట్ చోర్, గద్ది చోర్' (ఓటు దొంగలు, అధికారాన్ని వదులుకోండి) ర్యాలీలను నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 15 అక్టోబర్ 15 మధ్య ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి సంతకాలు చేసే కార్యక్రమానికి చేపడతాం. ఈ కార్యక్రమాలపై ఇండియా కూటమి ఒకే మాటపై ఉంది" అని కన్హయ్య కుమార్ తెలిపారు.



# ఓట్ల దొంగలు..గద్దెదిగండి

## కాంగ్రెస్ శ్రేణుల క్యాండిల్ ర్యాలీలు

ఖమ్మం ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఓటర్ల తొలగింపుపై సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**( మహా నెట్ వర్క్ )**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏఐసీసీ పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాలలో 'ఓట్ చోర్ గద్ది చోడ్' ఓట్ల దొంగలు గద్దె దిగండి అంటూ కాంగ్రెస్ శ్రేణులు క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కలిసి అక్రమాలకు పాల్పడినట్టు ఆధారాలతో సహా రాహుల్ గాంధీ నిరూపించిన నేపథ్యంలో ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా చేయాలని కాంగ్రెస్‌పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం రాత్రి అన్ని జిల్లా కేంద్రాలలో క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు. ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్ లో జరిగిన ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, ఫిరోజ్ ఖాన్, మెట్టు సాయి కుమార్, విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**క్యాండిల్ ర్యాలీ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

దేశానికి డెక్టేటర్ షిప్ పరిపాలన తీసుకుని రావాలని బీజేపీ ప్రభుత్వం చూస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎలక్షన్ కమిషన్ కూడా బీజేపీ పార్టీకి లొంగిపోయిందని, దేశ ప్రజలు వాస్తవాన్ని గమనిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో జరిగిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ చేపట్టిన క్యాండిల్ ర్యాలీ లో యువత, ప్రజలు అంత పాల్గొన్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ చేపట్టే కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి పౌరుడు ముందుకు రావాన్నారు.

**సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం : టీపీసీసీ చీఫ్ హేష్ గౌడ్**

బీహార్‌లో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా పై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి గొప్ప విజయమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తొలగించబడిన 65 లక్షల ఓటర్ల పేర్లను 48 గంటల్లో వెబ్‌సైట్‌లో ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని, రాహుల్ గాంధీ లేవనెత్తిన ఓటు చోరీ ఆరోపణలు సుప్రీంకోర్టు తీర్పుతో రుజువు అయ్యాయి.



## దృఢమైన విశ్వాసంతో భారత్ ముందుకు

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

ప్రపంచంలోని అత్యంత వేగంగా ఆర్థిక అభివృద్ధి

జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**(మొదటిపేజీ తరువాయి)**

దేశాన్ని కాపాడే విషయంలో మన సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ ఆపరేషన్ చాటి చెప్పింది.

**2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా..**

రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. సుపరిపాలన, అవినీతిని సహించని విధానాలతో భవిష్యత్తు వైపు దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటుతో.. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కశ్మీర్ లోయలో రైలు మార్గంతో స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం మరింత మెరుగుపడతాయి' అని పేర్కొన్నారు. 'శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం.. ఒక తరాన్ని గొప్ప కలలు కనేలా ప్రేరేపించింది. అదేవిధంగా దేశ మానవసహిత అంతరిక్ష కార్యక్రమం 'గగన్‌యాన్'కు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మరోవైపు.. నూతన ఆత్మవిశ్వాసంతో మన యువత క్రీడల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా చదరంగంలో మునుపెన్నడూ లేని విధంగా భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. 'జాతీయ విద్యా విధానం 2020' విస్తృత మార్పులు తీసుకొచ్చింది. దేశంలో ఆదాయ అసమానతలు తగ్గుతున్నాయి. ప్రాంతీయ అసమానతలు కూడా కనుమరుగవుతున్నాయి. సామాజిక సంక్షేమంతో కూడిన సమగ్ర ఆర్థిక వృద్ధి.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్‌ను ముందుకు నడుపుతోంది' అని తెలిపారు.

# గోల్డ్ రన్

## తులం లక్ష దాటినా అదే దూకుడు

తెలుగు రాష్ట్రాల్లో ఏటా రూ.50 వేల కోట్లకు పైనే వ్యాపారం

శ్రావణమాసంలో కొనుగోళ్ల కళ

ట్రంప్ టారిఫ్స్ ఎఫెక్ట్ తో పెరుగుతున్న ధరలు



**హైదరాబాద్, మహా:** బంగారం.. భారతీయ సంప్రదాయంలో ఒక భాగం. పండగలు, పెళ్లిళ్లకు ఎంతోకొంత పసిడి కొనుగోలు చేయడం మనవారి ఆనవాయితీ. ఆగస్టు నెల ప్రారంభం నుంచి 24 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు లక్షకు పైనే కొనసాగుతోంది. ప్రస్తుతం టారిఫ్స్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ట్రేడ్ టెన్షన్స్ పెరుగుతున్న క్రమంలో డాలర్ విలువ కూడా పతనమైంది. ఈ పరిస్థితులు కూడా బంగారాన్ని మరింత ప్రియంగా మార్చేస్తోందని నిపుణులు అంటున్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లెక్కల ప్రకారం భారతదేశంలో సంవత్సరానికి సగటున 700800 మెట్రిక్ టన్నుల బంగారం వినియోగం జరుగుతుంది, ఇందులో ఎక్కువ భాగం ఆభరణాల రూపంలో ఉంటుంది. భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద బంగారు ఆభరణాల వినియోగదారుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. పరిస్థితులు ఎలా ఉన్నా.. బంగారం కొనుగోళ్ళు మాత్రం తగ్గేదెలే అన్నట్లుగా సాగుతున్నాయి. ప్రస్తుతం బంగారం ధర లక్ష దాటింది. ₹1,00,000 ₹1,03,310 మధ్య (హైదరాబాద్ మార్కెట్‌లో) ఉంది. ఒక టన్ను బంగారం ధర సుమారు ₹10,000 కోట్లుగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాలలో 5070 టన్నుల బంగారం విక్రయం ఏటా జరుగుతుండగా, వీటివిలువ సుమారు ₹50,000 కోట్ల నుండి ₹70,000 కోట్ల వరకు ఉండవచ్చు. భారతదేశంలో బంగారం దిగుమతులు 2025 మార్చిలో 192% పెరిగాయి, ఇది డిమాండ్‌ను సూచిస్తుంది,

**సీజనల్ డిమాండ్**

తెలుగు రాష్ట్రాలలో బంగారం విక్రయాలు పండుగలు (ఉగాది, దసరా, దీపావళి), వివాహ సీజన్‌లు, మరియు అక్షయ తృతీయ వంటి శుభ దినాలలో గణనీయంగా పెరుగుతాయి. ఈ సమయంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలలో బంగారం డిమాండ్ గరిష్ఠ స్థాయిలో ఉంటుంది. ఇపుడు శ్రావణమాసం వివాహ వేడుకలు ఉండడంతో బంగారం దుకాణాలు కళకళలాడుతున్నాయి. మానేపల్లి జ్యూయలర్స్ లాంటి షోరూం సరికొత్త డిజైన్ లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.

**సాంస్కృతిక ఆకర్షణ:**

తెలుగు రాష్ట్రాలలో బంగారం సాంప్రదాయం, సంపదకు ప్రతీకగా ఉంటుంది, దీని వల్ల ఆభరణాల కొనుగోలు ఎక్కువగా ఉంటుంది.

**పెట్టుబడి డిమాండ్**

ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణ భయాలు, మరియు అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతల వల్ల బంగారం సురక్షిత పెట్టుబడిగా ఎంచుకోబడుతుంది, ఇది విక్రయాలను పెంచుతుంది.

# యూరియా కొరతపై డిబేట్‌కు రెడీ

- దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రావాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సవాల్
- యూరియా ఏమవుతుంది.. ఎవరు తింటున్నారని వ్యాఖ్య
- దీనిపై దర్యాప్తు చేద్దాం.. లేదంటే సీబీఐకి ఇద్దమంటూ డిమాండ్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏ రాష్ట్రంలో రాని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. గతం కన్నా ఎక్కువ తెలంగాణకు కేంద్రం ఇచ్చిందని, ఇంకా కొంత మొత్తమే ఇవ్వాల్సి ఉందన్నారు. యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు అని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుందని ఎద్దేవా చేశారు. యూరియా కొరతపై తాను డిబేట్‌కు సిద్ధం అని, దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రావాలని రాంచందర్ రావు సవాల్ విసిరారు.

**బీఆర్ఎస్ ఆరోపణలు కరెక్ట్ కాదు..**

'యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారు. కేంద్రం రైతులకి మేలు చేస్తుంది. కాంగ్రెస్ మాత్రం రైతులకు ద్రోహం చేస్తుంది. ఎరువులు ఎటు వెళ్తున్నాయో దమ్ముంటే దర్యాప్తు చేయండి, లేదంటే సీబీఐకి అనుమతి ఇవ్వండి. దర్యాప్తుకు ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి దమ్ము లేదు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలోకి వస్తే అక్కడ ఆ పార్టీ నాయకులే దళారులు. నాయకులే బ్లాక్ మార్కెట్ చేస్తారు. ఏ రాష్ట్రానికి ఎంత కోటా అనేది ముందే ఫిక్స్ అయి ఉంటుంది. బీఆర్ఎస్ ఆరోపణలు కరెక్ట్ కాదు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుంది. నేను డిబేట్‌కు సిద్ధంగా ఉన్నా, దమ్ముంటే రండి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సవాల్ విసిరారు.

# జిల్లాకు రూ. కోటి

## తక్షణ సహాయ చర్యల కోసం రిలీజ్

- అవసరమైతే మరిన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధం
- వర్షా ల పట్ల అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
- భారీ వర్షా ల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు జారీ
- వర్షా లపై జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్




**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఏ విధమైన ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని, వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై మంత్రి.. తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుతో కలిసి గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**సెలవులను రద్దు చేసి వెనక్కి పిలిపించాలి..**

గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్నమెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను అప్రమత్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయలు విడుదల చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.

## తెలుగు చిత్రపరిశ్రమలో ఎవరి కుంపటి వారిదే..

అల్లు అరవింద్ సంచలన వ్యాఖ్యలు.. జాతీయ అవార్డులొచ్చినా పండుగేదీ?




**హైదరాబాద్, మహా:** తెలుగు చిత్రసీమ తాజా పరిస్థితిపై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుండబద్దలు కొట్టారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎవరి కుంపటి వారిదేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. జాతీయ అవార్డులకు ఎంపికైన వారిని సత్కరించకపోవడంపై ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సైమా' (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ బృందం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమాకు ఏడు అవార్డులు వచ్చాయని, 'సైమా' స్పందించి అవార్డు విజేతలను సత్కరించడం అభినందనీయమని అన్నారు. జాతీయ అవార్డులు వచ్చినా మన సినిమా పరిశ్రమ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ అవార్డులను ఒక పండుగగా జరుపుకోవాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# హైకోర్టులో పెద్దమ్మతల్లి

## కూల్చివేతపై .. పూర్తి వివరాలు ఇవ్వండి

- పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని జాగ్రత్తగా భద్రపరచాలి
- ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ
- తదుపరి విచారణ 18కి వాయిదా

**హైదరాబాద్, మహా:** బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి కూల్చివేతపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బంజారాహిల్స్ రోడ్ నెం.12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని భద్రంగా భద్రపరచాలని సూచించింది. విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మగుడి కూల్చివేతపై కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. కూల్చివేతకు నిరసనగా హిందూ సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. ఈ మేరకు గత మంగళవారం కుంకుమార్చన పూజకు పిలుపునిచ్చారు హిందూ సంఘాల ప్రతినిధులు. ఈ పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌కు వెళ్లే అన్ని మార్గాలనూ మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పెద్దమ్మ గుడి దగ్గర భారీగా పోలీసులను మోహరించారు. తాజాగా ఈ ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది. పెద్దమ్మ గుడి కూల్చివేతపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ నమోదైంది. అక్రమంగా కూల్చిన ఆలయాన్ని తక్షణమే నిర్మించాలని పల్లె వినోద్ కుమార్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన న్యాయస్థానం విగ్రహాన్ని భద్రపరిచి.. కూల్చివేతలకు గల ఆధారాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.



# రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుదేలు

- కాంగ్రెస్ అసమర్థతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం
- ప్రస్తుత కాంగ్రెస్ పాలన నిరాశజనకంగా కనిపిస్తోంది
- కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి కేటీఆర్ మండిపాటు
- కుట్రపూరిత అరెస్టులను పోలీసులు మానుకోవాలని వ్యాఖ్య
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతోనే తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని ధ్వజమెత్తారు. వరుసగా నెలలు తెలంగాణ మైనస్ ద్రవ్యోల్బణమే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పతనం అయ్యిందనడానికి నిదర్శమన్నారు. ఈ మేరకు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. వరుస రెండు నెలల పాటు తెలంగాణ మైనస్ ద్రవ్యోల్బణంలోకి వెళ్లిపోవడం రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇదే తొలిసారి అని మండిపడ్డారు. దేశంలో ఇలాంటి పరిస్థితి వచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణనే కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా అణచివేసిందని, అదే సమయంలో ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమైందన్నారు. ఒక శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థను అవగాహన లేని పాలనతో నాశనం చేయడం చూస్తే బాధగా ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలన నిరాశజనకంగా కనిపిస్తోందన్నారు కేటీఆర్. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, రాష్ట్రాభివృద్ధి తిరోగమనంలో పయనిస్తోందన్నారు.

**కుట్రపూరిత అరెస్టులను మానుకుని..**

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ.. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గరలోనే ఉందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జోస్యం చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పోడు భూముల పట్టాల కోసం ఉద్యమిస్తున్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని దిందా రైతన్నలకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సహా ఇతర నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి.. వారి పక్షాన పోరాడుతున్న వారిని అక్రమంగా నిర్బంధించడం రేవంత్ ప్రభుత్వ గుండాగిరికి నిదర్శనమని కేటీఆర్ అభివర్ణించారు. పోడు రైతులను వేధించడం ఆపి.. వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ నేతలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# సగం కేసులు ఏపీ సహా 6 రాష్ట్రాల్లోనే..

## రేబిస్ మరణాల్లో సగం 5 రాష్ట్రాల్లోనే...




**మహా:** మన దేశంలో దాదాపు 1.53 కోట్ల వీధి కుక్కలు ఉన్నాయి. అంటే దేశ జనాభా (146 కోట్లు)లో దాదాపు 1 శాతానికి సమానమైన సంఖ్యలో ఇవి ఉన్నాయి. అత్యధికంగా వీధి కుక్కలు ఉన్న టాప్10 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ (2,059,261), ఒడిశా (1,734,399), మహారాష్ట్ర (1,276,399) ఉన్నాయి. రాజస్థాన్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో చెరో 10 లక్షలకుపైగా ఉన్నాయి. గుజరాత్‌లో 9.31 లక్షలు, బిహార్‌లో 6.96 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 4.71 లక్షల వీధి కుక్కలు ఉన్నాయి. అత్యధికంగా వీధి కుక్కలు ఉన్న మెట్రో నగరాల్లో బెంగళూరు (1.36 లక్షలు), ఢిల్లీ (55,462), ముంబై (50,799), చెన్నై (24,827), కోల్‌కతా (21,146), హైదరాబాద్ (10,553) ఉన్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ 2023 నవంబరులో విడుదల చేసిన గణాంకాలు. ఒక్క వీధి కుక్క లేని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో మణిపూర్, దాద్రా నగర్ హవేలీ, లక్షద్వీప్ ఉన్నాయి. మిజోరంలో 69, నాగాలాండ్‌లో 342 వీధి కుక్కలు మాత్రమే ఉన్నాయి.

**వీధి కుక్కల నియంత్రణపై రాజ్యాంగంలోనూ ప్రస్తావన**

భారత రాజ్యాంగం చాలా మహోన్నతమైంది. వ్యక్తిగత హక్కులు, వాక్ స్వాతంత్ర్యం, వ్యక్తి పరిధులు, విధులు, కర్తవ్యాలు, సమాజంలో వ్యక్తి పాత్ర తదితరాలన్నింటితో పాటు మూగజీవాలు, జంతువుల పరిరక్షణకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. జంతువుల సంక్షేమం, పరిరక్షణతో పాటు, వాటికి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలకు కేటాయిస్తున్నామని రాజ్యాంగంలోని ఆర్టికల్ 246(3) చెబుతోంది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమం ద్వారా వీధి కుక్కల నియంత్రణకు స్థానిక సంస్థలు చర్యలు చేపట్టాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (డబ్ల్యూ), ఆర్టికల్ 246 పేర్కొంటోంది.

**కుక్క కాటు కేసులపై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు**

"కుక్క కాటు కేసులు దేశంలో పెరిగిపోతుండటం ఆందోళనకరమైన అంశం. దీనివల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తీవ్రమైన భయాన్ని వీధి కుక్కలు సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితిని ఆపాల్సిన అవసరం ఉంది. ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్ సీఆర్)లోని వీధి కుక్కలను పట్టుకొని, ప్రత్యేకమైన డాగ్ షెల్టర్లకు తరలించాలి. ఇందుకోసం ఢిల్లీ మున్సిపల్ విభాగం 5వేల డాగ్ షెల్టర్లను 8 వారాల్లోగా ఏర్పాటు చేయాలి. కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన మానవ వనరులను, పశు వైద్యులను సమకూర్చుకోవాలి. డాగ్ షెల్టర్లు వేదికగా దీర్ఘకాలం పాటు కుక్కల పోషణ కోసం ఏర్పాట్లు చేయాలి. ఆసక్తి కలిగిన వారికి వాటిని దత్తత ఇచ్చే ప్రణాళికలను సైతం సిద్ధం చేసుకోవాలి" అని తాజాగా ఆగస్టు 11న (సోమవారం) సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

**కుక్క కాటు కేసుల్లో టాప్-10 రాష్ట్రాలు**

మనదేశంలో నిత్యం ఎంతోమందిని వీధికుక్కలు కరుస్తున్నాయి. అవి కరవడంతో కొందరు రేబిస్ వ్యాధి బారినపడుతున్నారు. మరికొందరు సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారు. పలువురు తీవ్ర గాయాలతో సతమతం అవుతున్నారు. 2022 సంవత్సరం నుంచి 2024 సంవత్సరం మధ్యకాలంలో భారత్‌లో దాదాపు 89 లక్షలకుపైగా కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. 2022లో 21.8 లక్షలు, 2023లో 30.5 లక్షలు, 2024లో 37.1 లక్షల కుక్క కాటు కేసులు నమోదవడం గమనార్హం. అంటే ఈ కేసులు ఏటా పెరుగుతూపోయాయి. ఆ మూడేళ్లలో దేశంలో ఏకంగా 45 శాతం మేర కుక్కకాటు ఘటనలు పెరిగాయి. 20222024 మధ్యకాలంలో అత్యధికంగా కుక్క కాటు కేసులు నమోదైన టాప్10 రాష్ట్రాల్లో మహారాష్ట్ర (13.5 లక్షలు), తమిళనాడు (12.8 లక్షలు), గుజరాత్(8.40 లక్షలు), కర్ణాటక(7.57 లక్షలు), ఆంధ్రప్రదేశ్(6.49 లక్షలు), బిహార్(6.47 లక్షలు), ఉత్తరప్రదేశ్(5.85 లక్షలు), తెలంగాణ(3.33 లక్షలు), రాజస్థాన్ (3.32 లక్షలు), ఒడిశా (3.25 లక్షలు) ఉన్నాయి.

**రేబిస్ మరణాల్లో టాప్-10 రాష్ట్రాలు ఇవే**

కుక్క కాటుకు గురైన వారికి ఇన్ఫెక్షన్ వల్ల రేబిస్ వ్యాధి వచ్చే ముప్పు ఉంటుంది. దీనివల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 59వేల మరణాలు సంభవిస్తుంటాయి. 2022 సంవత్సరం నుంచి 2024 సంవత్సరం మధ్యకాలంలో భారత్‌లో 125 మంది రేబిస్‌తో చనిపోయారు. ఈ మరణాలు అత్యధికంగా సంభవించిన టాప్10 రాష్ట్రాల్లో మహారాష్ట్ర (35), కర్ణాటక (12), మధ్యప్రదేశ్ (9), తమిళనాడు (9), ఉత్తరప్రదేశ్ (9), బిహార్ (6), మణిపూర్ (6), హిమాచల్ ప్రదేశ్ (5), మేఘాలయ (5), ఆంధ్రప్రదేశ్ (4) ఉన్నాయి. మహారాష్ట్రలో 2022లో 7, 2023లో 14, 2024లో 14 రేబిస్ మరణాలు చోటుచేసుకున్నాయి. 2022 2024 మధ్యకాలంలో భారత్‌లోని 9 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒక్క రేబిస్ మరణం కూడా నమోదు కాలేదు. మిగతా రాష్ట్రాల్లో కేవలం ఒక్కో రేబిస్ మరణమే సంభవించింది. అయితే కుక్క కాటు కేసులు, రేబిస్ మరణాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలపై ప్రధాన ఫోకస్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు దీర్ఘకాలిక వ్యూహం అవసరమని వారు అంటున్నారు. రాజ్యాంగంలోని నిబంధనలకు విఘాతం కలిగించకుండా ఈ దిశగా చర్యలను చేపట్టాలని సూచిస్తున్నారు.

# దూకుడు పెంచిన కవిత!

- తెలంగాణ జాగృతి కమిటీల నియామకం
- జాగృతి అనుబంధ విభాగాలు, జిల్లా అధ్యక్షుల ప్రకటన
- నూతన నియామకాలు వెంటనే అమల్లోకి: అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, మహా:** తెలంగాణ జాగృతి సంస్థాగత నిర్వహణలో భాగంగా పలు అనుబంధ విభాగాలకు అధ్యక్షులతో పాటు 11 జిల్లాలకు అధ్యక్షులను నియమించామని కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో తెలిపారు. నూతన నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. నూతన బాధ్యులు సంస్థ బలోపేతానికి, ఆశయాల సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. తెలంగాణ జాగృతి ఏర్పాటు నుంచి సంస్థాగత పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈరోజు నియామకాల్లోనూ ఆయా కులాలతో పాటు మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. 11 జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తే వారిలో ఐదుగురు బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీ ఉన్నారని తెలిపారు. అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల నియామకాల్లోనూ సామాజిక న్యాయం పాటించామని పేర్కొన్నారు.

**వివిధ విభాగాలకు నూతన బాధ్యులు**

ఆర్గనైజింగ్ సెక్రటరీ :దూగుంట్ల నరేష్ ప్రజాపతి
అధికార ప్రతినిధి: నలమాస శ్రీకాంత్ గౌడ్
ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు
బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు ఇత్తరి మారయ్య
రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈగ సంతోష్ ముదిరాజ్
తెలంగాణ జాగృతి ఎంబీసీ అండ్ సంచార జాతుల విభాగం రాచమల్ల బాలక్రిష్ణ
సింగరేణి జాగృతి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. వెంకటేష్
తెలంగాణ జాగృతి మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మేక లలిత యాదవ్
తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల శివారెడ్డి
రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్వాల జితేందర్ ప్రజాపతి
రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్యా రవి రాథోడ్
రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలె నిషా లెనిన్
రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్
తెలంగాణ జాగృతి విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మునుకుంట్ల నవీన్ గౌడ్
హైదరాబాద్ జిల్లా విద్యార్థి అధ్యక్షులు గుమ్మడి క్రాంతి కుమార్
నిజాం కాలేజ్ అధ్యక్షులు వల్లకొండ అజయ్ రెడ్డి
సాహిత్య జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కాంచనపల్లి గోవర్ధన్ రాజు
రైతు జాగృతి రాష్ట్ర అధ్యక్షులు మంథని నవీన్ రెడ్డి
తెలంగాణ జాగృతి ఐటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు శశిధర్ గుండెబోయిన
రాష్ట్ర ఉపాధ్యక్షులు హరికృష్ణ బ్రహ్మాండభేరి
తెలంగాణ జాగృతి మైనారిటీ ముస్లిం విభాగం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా
తెలంగాణ జాగృతి మైనారిటీ క్రిస్టియన్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు జి. డేవిడ్
ఆటో జాగృతి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ సలీం

**వివిధ జిల్లాల తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు:**


1.కామారెడ్డి జిల్లా ఎదురుగట్ల సంపత్ గౌడ్
2.యాదాద్రి భువనగిరి జిల్లా చందుపట్ల సుజీత్ రావు
3.జగిత్యాల జిల్లా చెర్లపల్లి అమర్ దీప్ గౌడ్
4.నిర్మల్ జిల్లా భూక్యా జాను బాయి
5.కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా శ్రీ వినోద్
6.మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రామిడి వెంకట్ రెడ్డి
7.నాగర్ కర్నూల్ జిల్లా దారమోని గణేష్
8.నారాయణపేట జిల్లా గవినోళ్ల శ్రీనివాస్
9.సూర్యాపేట జిల్లా ఎస్. క్రిష్ణవేణి
10.హన్మకొండ జిల్లా పర్లపల్లి శ్రీశైలం
11.భూపాలపల్లి జిల్లా మాడ హరీశ్ రెడ్డి

## సీఎం రేవంత్‌ను కలిసిన రాహుల్ సిప్లిగంజ్

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కలిశాడు. బోనాల పండుగ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 1 కోటి నగదు బహుమతికి సీఎంకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సత్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని, దానికి తగినట్టుగా మరింత కృషి చేస్తానంటూ రాహుల్ చెప్పుకొచ్చాడు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి, రాహుల్‌కి 10 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 1 కోటి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన గద్దర్ అవార్డుల కార్యక్రమంలో రాహుల్‌ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి.. తనకు తగిన బహుమతి ఇవ్వాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు.

# తొలగించిన 65 లక్షల ఓటర్ల లిస్టు ఇవ్వండి

- ఆ వివరాలు ఈ నెల 19 లోపు బహిర్గతం చేయాలి
- ఈ నెల 22 నాటికి సంబంధిత నివేదికను మా ముందు ఉండాలి
- ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశాలు



**ఢిల్లీ, మహా:** కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బిహార్‌లో ఇటీవల జరిగిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో 65 లక్షల మంది పేర్లు తొలగించిన విషయంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఆ 65 లక్షల మంది వివరాలను ఈ నెల 19లోపు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నెల 22 నాటికి సంబంధిత నివేదికను తమ ముందు ఉంచాలని సూచించింది. అలాగే ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారు ఆధార్ కార్డు సమర్పించవచ్చని తెలిపింది. బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టులో గురువారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వాదనలు వినిపిస్తూ.. 'ఓటర్ల జాబితా సవరణ వంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయి. రాజకీయ వాతావరణంలో పనిచేస్తున్న నేపథ్యంలో.. వివాదాస్పదం కాని నిర్ణయమంటూ ఏదీ లేదు. పార్టీల పోరు మధ్యలో చిక్కుకున్నాం. గెలిస్తే ఈవీఎంలు మంచివని, ఓడిపోతే చెడ్డవని ప్రచారం చేస్తున్నారు' అని పేర్కొంది. ముఖ్యంగా మరణించిన, వలస వెళ్లిన లేదా ఇతర నియోజకవర్గాలకు తరలిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయడంలో ఈసీ (ఎన్నికల సంఘం) ఎందుకు వెనుకంజ వేస్తోందో ప్రశ్నించింది. ఆ వివరాలు ఎందుకు దాచాలి?" అని కోర్టు ప్రశ్నించింది.

**30 రోజుల్లోపు సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది కదా?**

సుప్రీం కోర్టు నేరుగా ఈసీని ప్రశ్నిస్తూ.. ఇలాంటి ఓటర్ల పేర్లను ప్రజల ముందు ప్రకటించకూడదని మీ ఆలోచన ఎందుకు? ఆ పేర్లు బహిర్గతం చేస్తే, తప్పుగా తొలగించిన వారు 30 రోజుల్లోపు సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది కదా? అని స్పష్టం చేసింది. పౌరుల హక్కులు రాజకీయ నేతల సౌకర్యం లేదా నిర్ణయాలపై ఆధారపడి ఉండకూడదు అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈసీ వివరణ ఇచ్చింది. కోర్టు ప్రశ్నలకు సమాధానంగా ఎన్నికల సంఘం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొలగించిన వ్యక్తుల జాబితాను రాజకీయ పార్టీలకు ఇప్పటికే అందజేశామని పేర్కొంది. అదనంగా, జిల్లా స్థాయిలో ఈ వివరాలను ప్రజలకు పంచేందుకు సిద్ధముగా ఉన్నామని తెలిపింది. కాగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతను పెంచడం, తప్పుగా తొలగించిన పౌరులకు సత్వర న్యాయం కల్పించడం, రాజకీయ ప్రభావం లేకుండా ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షించడం లక్ష్యంగా సుప్రీం ఈ ఆదేశాలు ఇచ్చింది.

# పంద్రాగస్టు పండగ

పంద్రాగస్టు పండుగ వచ్చే
పింగళి దిద్దిన పతాక ఎగిరే
నిరంకుశంపై నిప్పులు చెరగి
ముష్కర మూకల పంతం పట్టి
వందేమాతర మంటూ
మనదే భారత మంటూ
పంద్రాగస్టు పండుగ వచ్చే
పింగళి దిద్దిన పతాక ఎగిరే

ప్రాణాలెన్నో పణముగ పెట్టి
దాస్యంపైన దాడులు చేసి
స్వారాజ్యమే మా జన్మహక్కని
తెల్ల దొరలను తరిమి కొట్టిన
ధైర్యం నింపిన పతాక మనది
స్థైర్యాన్నిచ్చిన జండా మనది

నీతికి నాడు పట్టం కట్టి
అవినీతిని అణువున పాతర వేసి
నిండుగ మెండుగ ఎగిరిన జండా
విప్లవాలను రగిలించిన జండా
పిడికిల్లెత్తి నడిపించిన జండా

జాతి గొప్పను చాటి చెప్పుచూ
దేశభక్తిని పెంచి కదులుతూ
అందరి కన్నులు ఒకే చూపులా
అందరి మనసులు ఒకే మాటలా

నవ కేతనమై ..
ఘన చేతనమై
శృంఖలాలను ఛేదించిన జండా
స్వాతంత్ర్యాన్ని సాధించిన జండా

గుండెకు తగిలిన గాయాలెన్నో
మట్టికి అంటిన మరకలు ఎన్నో
పోరాటాల మలుపుల్లోన
పోయిన జన ప్రాణాలెన్నో
పంద్రాగస్టు పండుగ వెనుక
అంతే తెలియని గాథలు ఎన్నో
మరువగలేని విషాదమెంతో

స్వేచ్చను ఇచ్చి..
కీర్తిని పెంచిన
త్యాగ ధనులను
జాతి ఘనులను
స్మరించుకుందాం
దేశం కోసం..దేహత్యాగం
చేసిన వారికి
సెల్యూటందాం
వందే మాతరమంటూ
పులకితులవుదాం
జైహిందంటూ
పునీతులవుదాం

**- అళహరి శ్రీనివాసాచార్యులు**


## రఘునందన్ రావు.. నీకంత సీన్ లేదు

- మీరెంత మాట్లాడినా యూజ్ లేదు
- మీ కథలు రాహుల్ గాంధీ కచ్చితంగా ముగిస్తారులే
- పెద్ద వాళ్లపై మాట్లాడితే పెద్ద వాడివి అయిపోతావని అనుకోకు
- ఎంపీ రఘునందన్ రావుకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, మహా:** ఎంపీ రాఘునందన్ రావుకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపైన మాట్లాడేంత స్థాయి రఘునందన్ రావుకు లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక వీడియో విడుదల చేశారు. అడ్డిమారి గుడ్డి సూటితో కన్నులొట్టపోయినట్లు బీఆర్ఎస్ సహకారంతో ఎంపీగా గెలిచావని హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుతో ఒప్పందం చేసుకుని మెదక్ ఎంపీ అయ్యావని ఆరోపించారు. రాహుల్ గాంధీకి, నీకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పెద్ద వాళ్ల పైన మాట్లాడితే పెద్ద వాడివి అయిపోతానని రఘునందన్‌రావు అనుకుంటున్నాడు.. నీకంత సీన్ లేదు.. బీజేపీలోనే నీకు బేస్ లేదు.. అని తీవ్ర విమర్శలు గుప్పించారు. రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము మీకు లేదన్నారు. ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తుంటే మీరేందుకు ఉలిక్కి పడుతున్నారు.. అసలు మీ భయం ఏంటి..? మీకెందుకంత వణుకు..? అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా చిత్ర విచిత్రాలను మా రాహుల్‌గాంధీ బయటపెడుతున్నారని, చనిపోయిన వాళ్లతో టీ తాగే అద్భుత అవకాశం ఈసీ రాహుల్ గాంధీకి ఇచ్చిందని తెలిపారు. చనిపోయిన వాళ్లు ఏకంగా సుప్రీంకోర్టులో ప్రత్యక్షమౌతున్నారని, రాహుల్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఈసీ నీళ్లు మింగుతోందని విమర్శించారు. బండారం బయటపడుతుందనే భయంతో బీజేపీ నాయకులున్నారని, మీరెంత మాట్లాడినా ఉపయోగం లేదు.. మీ కథ ను మా రాహుల్ గాంధీ ముగిస్తాడు చూడండి అని ఫైర్ అయ్యారు.




# కూలీ రివ్యూ.. రజినీ హిట్ కొట్టారా?



గత కొన్నిరోజుల నుంచి సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా 'కూలీ' హడావుడే. సూపర్‌స్టార్ రజినీకాంత్, డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కాంబో కావడం.. తొలిసారి కింగ్ నాగార్జున విలన్‌గా చేయడం.. దానికి తోడు అనిరుధ్ పాటలు వైరల్ కావడం.. ఇలా ఎక్కడలేని హైప్ అంతా ఈ మూవీపై ఏర్పడింది. అలా భారీ అంచనాలు ఏర్పరుచుకున్న ఈ చిత్రం ఎట్టకేలకు ఇప్పుడు థియేటర్లలోకి వచ్చేసింది. మరి అభిమానులు ఆశపడ్డట్లు రజినీకాంత్ హిట్ కొట్టారా? ఇంతకీ 'కూలీ' ఎలా ఉంది? రివ్యూలో చూద్దాం.

### కథేంటి?

వైజాగ్ పోర్ట్‌లో కింగ్‌పిన్ లాజిస్టిక్స్ పేరుతో సైమన్ (నాగార్జున) పెద్ద డాన్‌గా చెలామణీ అవుతుంటాడు. ఖరీదైన వాచీలు, ఎలక్ట్రానిక్స్ లాంటివి విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. అయితే ఎక్స్‌పోర్ట్స్ ముసుగులో చేయకూడని పనేదో చేస్తుంటారు. సైమన్ అండర్‌లో దయాల్ (సౌబిన్ షాహిర్) ఇదంతా చూసుకుంటూ ఉంటాడు. వీళ్ల దగ్గర పనిచేసే రాజశేఖర్ (సత్యరాజ్) ఓ రోజు చనిపోతాడు. ఇతడికి దేవా (రజినీకాంత్) అనే ఫ్రెండ్ ఉంటాడు. కొన్ని కారణాల వల్ల దేవారాజశేఖర్.. 30 ఏళ్ల పాటు దూరంగా ఉంటారు. తన ప్రాణ స్నేహితుడు ఇక లేడనే విషయం తెలుసుకుని దేవా.. వైజాగ్ వస్తాడు. తర్వాత ఏమైంది? సైమన్‌దేవాకి కనెక్షన్ ఏంటి? ఇంతకీ కలీషా (ఉపేంద్ర), ప్రీతి (శ్రుతి హాసన్), దాహా (ఆమిర్ ఖాన్) ఎవరు? అనేది మిగతా స్టోరీ.

### ఎలా ఉందంటే?

కూలీ ట్రైలర్ రిలీజ్ కాగానే.. చాలామంది చాలారకాలుగా అంచనా వేశారు. ఇదేదో ట్రైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్షన్ అని మాట్లాడుకున్నారు. అలానే లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌కి కనెక్షన్ కచ్చితంగా ఉంటుంది అని అనుకున్నారు. కానీ ఇది ఫక్తు రివేంజ్ కమర్షియల్ డ్రామా. ఎల్‌సీయూతో ఎలాంటి లింక్ లేదు. సింపుల్‌గా ఒక్క ముక్కలో చెప్పాలంటే తన ఫ్రెండ్‌ని ఎవరో చంపేస్తారు. ఆ విషయం తెలుసుకున్న హీరో.. ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడు? ఇంతకీ చంపింది ఎవరు అనేదే స్టోరీ. వైజాగ్ పోర్ట్ ఏరియా, అక్కడ సైమన్ స్మగ్లింగ్ సామ్రాజ్యం, దాన్ని చూసుకునే దయాల్.. ఇలా కాస్త ఇంట్రెస్టింగ్‌గానే సినిమా మొదలైంది. కట్ చేస్తే దేవాగా రజినీకాంత్ ఎంట్రీ. వెంటనే ఓ పాట. కాసేపటికే తన ఫ్రెండ్ రాజశేఖర్ చనిపోయాడనే వార్త.. ఇది తెలిసి అతడి ఇంటికి దేవా వెళ్లడం, అక్కడేమో రాజశేఖర్ కూతురు ప్రీతి.. కాసేపటికి సైమన్ ఎంట్రీ.. అలా ఒక్కో పాత్ర పరిచయం చేస్తూ వెళ్లారు. తన ఫ్రెండ్‌ని చంపింది ఎవరో తెలుసుకునే క్రమంలో హీరో.. విలన్ గ్యాంగ్‌లో చేరడం, తాను వెతుకుతున్న హంతకుడు ఎవరో తెలియడం లాంటి అంశాలతో తొలి భాగం ముగుస్తుంది. దేవా మ్యాన్షన్‌లోనే హీరో చేసే ఓ ఫైట్ తప్పితే ఫస్టాఫ్ అంతా డ్రామానే ఉంటుంది. సాధారణంగా ఏ సినిమా అయినా సరే ఇంటర్వెల్‌లో ఫైట్ లాంటిది ఎక్స్‌పెక్ట్ చేస్తాం. కానీ ఇందులో కాస్త డిఫరెంట్. తొలి సగంలో ఎక్కువగా డ్రామానే ఉంది కదా కనీసం సెకండాఫ్‌లో అయినా యాక్షన్ ఉంటుందా అనుకుంటే అక్కడ కూడా అదే డ్రామాని నడిపించారు. సినిమాలో స్టార్స్ ఎక్కువమంది అయ్యేసరికి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే ప్రయత్నంలో సినిమా మొత్తం కలగాపులగం అయిపోయింది. దయాల్ పాత్రలో ట్విస్టులు బాగున్నాయి. సైమన్ దగ్గర పనిచేస్తూ, అతడి కొడుకుని ప్రేమించే అమ్మాయి క్యారెక్టర్ ఒకటి ఉంటుంది. ఆ పాత్రలో ట్విస్టులు కూడా బాగున్నాయి. మూవీలో యాక్షన్ కంటే డ్రామా ఎక్కువైపోవడంతో చాలా సాగదీతగా అనిపిస్తుంది. క్లైమాక్స్‌లో దాహా అనే పాత్రలో ఆమిర్ ఖాన్ ఎంట్రీ పెద్దగా ఇంపాక్ట్ చూపించిందా అంటే లేదు.

### ఎవరెలా చేశారు?

రజినీకాంత్ ఎప్పటిలానే తన స్వాగ్, స్టైల్‌తో ఆకట్టుకున్నారు. విలనిజం చేసిన నాగార్జున.. కాస్త కొత్తగా కనిపించారు. ఆయన పాత్ర డిజైన్ బాగానే ఉంది గానీ ఏదో అసంతృప్తిగా అనిపించింది. సత్యరాజ్, ఉపేంద్ర ఉన్నారంటే ఉన్నారు అంతే. పెద్దగా స్కోప్ దొరకలేదు. శ్రుతి హాసన్ కూడా ఇచ్చినంతవరకు న్యాయం చేసింది. దయాల్‌గా చేసిన మలయాళ నటుడు సౌబిన్ షాహిర్.. మెస్మరైజ్ చేశాడు. కల్యాణిగా చేసిన కన్నడ నటి రక్షిత రామ్ కూడా చిన్న రోల్ అయినా బాగుంది. ఆమిర్ ఖాన్ పాత్ర కూడా తేలిపోయింది. సినిమాలో కథ పరంగా పెద్దగా మెరుపులు, హై మూమెంట్స్ లేనప్పటికీ టెక్నికల్‌గా స్ట్రాంగ్‌గా ఉంది. రిచ్ విజువల్స్, స్టార్ వాల్యూ ఉన్నంతలో కాస్త రిలీఫ్. అనిరుధ్ గురించి చెప్పుకోవాలి. చాలా సాధారణమైన సన్నివేశాల్ని కూడా తన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ఎలివేట్ చేశాడు. కొన్నిచోట్ల బాగానే వర్కౌట్ అయ్యాయి. సినిమా అంతా చూసిన తర్వాత ఇది తీసింది లోకేశ్ కనగరాజేనా అనే సందేహం వస్తుంది. ఎందుకంటే ప్రేక్షకులు చాలానే ఎక్స్‌పెక్ట్ చేశారు. కానీ ఆ అంచనాల్ని అందుకోవడం ఆమాడ దూరంలో ఆగిపోయాడు. నిర్మాణ విలువలు టాప్ నాచ్ ఉన్నాయి కానీ కథలో బలం లేకపోతే ఏం లాభం. ఓవరాల్‌గా చెప్పుకుంటే సోషల్ మీడియాలో ఉన్న హైప్‌కి.. 'కూలీ' సినిమాలో స్టోరీకి ఏ మాత్రం సంబంధం లేదు.



# పరదాలమ్మా పరదాలు..

## సినిమా కోసం రోడ్డెక్కిన హీరోయిన్!

అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో వస్తోన్న తాజా చిత్రం 'పరదా'. ఈ లేడీ ఓరియంటెడ్ చిత్రానికి సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించారు. ఇప్పటికే పరదా ట్రైలర్ రిలీజ్ చేయగా..ఈ మూవీపై అభిమానుల్లో అంచనాలు మరింత పెంచేసింది. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్లతో అనుపమ ఫుల్ బిజీగా ఉంది. దీంతో వరుస ఇంటర్వ్యూలకు హాజరవుతోంది. తాజాగా తన మూవీ పరదా ప్రమోషన్స్‌ను రోటీన్‌కు భిన్నంగా నిర్వహించింది. వైజాగ్‌లో ఏకంగా రోడ్డుపై మైక్ పట్టుకుని ప్రచారం చేసింది. పరదాలమ్మా.. పరదాలు.. రంగురంగుల పరదాలు.. తీసుకోవాలమ్మా.. తీసుకోవాలి అంటూ కారులో నిలబడి తన మూవీని ప్రమోట్ చేసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కాగా.. అనుపమ పరమేశ్వరన్ నటించిన పరదా ఆగస్టు 22న థియేటర్లలోకి మూవీ రానుంది. ఇందులో అనుపమతో పాటు మలయాళ నటి దర్శన్, సంగీత కూడా కీలక పాత్రల్లో నటించారు.

# ఇక్కడ ఎవరి కుంపటి వారిదే..



టాలీవుడ్ నిర్మాత అల్లు అరవింద్ సంచలన కామెంట్స్ చేశారు. ఇండస్ట్రీలో ఎవరి కుంపటి వారిదేనంటూ బాంబు పేల్చారు. అందుకే ఎలాంటి మంచి పనులు చేయలేకపోతున్నామని మాట్లాడారు. సైమా అవార్డుల ప్రెస్‌మీట్‌కు హాజరైన అరవింద్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగు సినిమాలకు 7 జాతీయ అవార్డులు వచ్చాయని.. ఇండస్ట్రీ స్పందించి సత్కరించకముందే సైమా గుర్తించిందని తెలిపారు. జాతీయ అవార్డులపై సైమా స్పందించి విజేతలను సత్కరించడం అభినందనీయమని అన్నారు. మనకు ఎన్నీ జాతీయ అవార్డులు వచ్చినా టాలీవుడ్ సినీ పరిశ్రమ మాత్రం స్పందించలేదన్నారు. జాతీయ అవార్డులను ఒక పండుగగా జరుపుకోవాల్సిన గొప్ప వేడుక అని అల్లు అరవింద్ వెల్లడించారు.

# రూ.31 కోట్లతో ఆస్తి కొనుగోలు చేసిన హృతిక్ రోషన్

కొత్త సినిమా వార్2తో అలరిస్తున్న బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ నటనలోనే కాదు వ్యాపారంలోనూ దూసుకుపోతున్నారు. ఆస్తులు కూడబెట్టడంలో, వాటి విలువను పెంచడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఇటీవల ముంబయిలోని ఓ ఆస్తిని కొనుగోలు చేయడంతో అందుకు సంబంధించిన వివరాలు వైరల్ అవుతున్నాయి. హృతిక్ రోషన్ తన తండ్రి రాకేష్ రోషన్ స్థాపించిన హెచ్‌ఆర్‌ఎక్స్ డిజిటెక్ ఎల్‌ఎల్‌పీ కంపెనీ కోసం ముంబైలోని చండీవాలి ప్రాంతంలో మూడు కార్యాలయ యూనిట్లను రూ.31 కోట్లకు కొనుగోలు చేశారు. అంధేరీ ఈస్ట్‌లోని చండీవలి ప్రాంతంలోని బూమరాంగ్ పేరుతో ఉన్న భవనం మొదటి అంతస్తులోని ఈ మూడు కార్యాలయాలు 13,546 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. దీనికి సంబంధించి 2025 జులై 9న కొనుగోలు జరిగిందని డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తుంది. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ప్రకారం ఈ లావాదేవీలో స్టాంప్ డ్యూటీ రూ.1.86 కోట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.30 వేలుగా ఉంది. ఈ లావాదేవీలో అమ్మకందారులుగా మనీష్ కృష్ణం గోపాల్ బజారీ, షాలిని మనీష్ బజారీ, బాజ్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. ఈ భవనంలో రోషన్ కుటుంబం పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి కాదు. సెప్టెంబర్ 2024లో హెచ్‌ఆర్‌ఎక్స్ డిజిటెక్ ఎల్‌ఎల్‌పీ ఐదో అంతస్తులోని ఐదు కార్యాలయ యూనిట్లను రూ.37.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఇందులో 17,389 చదరపు అడుగుల స్థలం ఉంది. ఇంతకు ముందు రోషన్ కుటుంబం రూ.6.75 కోట్లకు అంధేరీలో మూడు అపార్ట్‌మెంట్లను విక్రయించింది. అంధేరీ వెస్ట్‌లోని విజయ్ నివాస్ సీహెచ్‌ఎస్ లిమిటెడ్ భవనంలో 1,025 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను రాకేష్ రోషన్ విక్రయించారు. ఈ ఆస్తితో పాటు రెండు పార్కింగ్ స్థలాలను సోనాలి అజ్మీరాకు రూ.3.75 కోట్లకు విక్రయించారు. మే 25న జరిగిన ఈ లావాదేవీలో రూ.18.75 లక్షల స్టాంప్ డ్యూటీ చెల్లింపు, రూ.30,000 రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఉన్నాయి. మరో లావాదేవీలో రాకేష్ రోషన్ అంధేరి వెస్ట్‌లోని రహేజా క్లాసిక్ భవనంలోని 625 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను జీవన్ భావనానీ, శిల్పా వాధ్వానీ, గౌరవ్ వాధ్వానీ అనే ముగ్గురు వ్యక్తులకు రూ.2.20 కోట్లకు విక్రయించారు. ఈ లావాదేవీ మే 17న నమోదు కాగా, స్టాంప్ డ్యూటీ రూ.13.20 లక్షలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.30 వేలు చెల్లించారు.





# నాన్న కోసమే రజనీకాంత్ ఆ మూవీలో నటించారు.. అంతేకాదు!

రజనీకాంత్ నడుచుకుంటూ వస్తే చాలు రికార్డులు వాటంతటవే వస్తాయి. బస్ కండక్టర్ నుంచి సూపర్‌స్టార్‌గా ఎదిగిన రజనీ ప్రస్థానం ఎందరికో ఆదర్శనీయం. ఆగస్టు 15 నాటికి రజనీ సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి 50 ఏళ్లు పూర్తవుతాయి. ఈ సందర్భంగా రజనీ ఆప్త మిత్రుడు మోహన్‌బాబు కూతురు మంచు లక్ష్మి అనేక విషయాలను పంచుకుంది.

**నాన్న చిన్నపిల్లాడిగా..**

మంచు లక్ష్మి మాట్లాడుతూ.. రజనీ అంకుల్ మమ్మల్ని ఎంతో ప్రేమిస్తాడు. మాక్కూడా ఆయనంటే చాలా ఇష్టం. అంకుల్ వచ్చాడంటే మా నాన్న చిన్నపిల్లాడయిపోతాడు. ఇప్పటికీ వాళ్లిద్దరూ ఒకరినొకరు సరదాగా ఆట పట్టించుకుంటూ ఉంటారు. 50 ఏళ్లుగా కొనసాగుతున్న అందమైన స్నేహం వారిది. నటులవ్వడానికి ముందు నుంచే ఇద్దరూ మంచి మిత్రులు.

**కష్టసుఖాల్లోనూ..**

మా నాన్న ఎప్పుడైనా బాధలో ఉంటే అంకుల్ సపోర్ట్‌గా నిలబడతాడు. అలాగే అంకుల్‌కు ఏదైనా కష్టమొచ్చిందంటే నాన్న తోడుగా ఉంటాడు. అన్ని రకాల పరిస్థితుల్లోనూ ఇద్దరూ కలిసే ఉంటారు. అలాంటి ఫ్రెండ్ దొరకాలని ప్రతి ఒక్కరూ ఆ దేవుడిని కోరుకోవాల్సిందే! పెదరాయుడు సినిమాలో అంకుల్ గెస్ట్ రోల్ చేశాడు.

**పెదరాయుడు మూవీలో..**

నిజానికి ఆయనకు ఆ సినిమా చేయాల్సిన అవసరం లేదు. కానీ కేవలం ఫ్రెండ్‌షిప్ కోసం మాత్రమే ఆ మూవీలో యాక్ట్ చేశాడు. నాన్న కోసం ఆయన స్వయంగా రాయలసీమ రామన్న చౌదరి సినిమా కథ రాసిచ్చాడు. అదీ వారి ఫ్రెండ్‌షిప్ గొప్పదనం. వ్యక్తిగతంగానే కాకుండా కెరీర్‌లోనూ ఒకరికొకరు తోడుగా ఉన్నారు అని మంచు లక్ష్మి చెప్పుకొచ్చింది.



# చేయి లేని సూపర్ హీరో?

## ఇరుంబు కై మాయావి కథలో మార్పులు

వెండితెరపై సూపర్ హీరో చేసే విన్యాసాలు పిల్లలు, పెద్దలు అందరికీ నచ్చుతాయి. ఇక ఆమిర్ ఖాన్‌లాంటి హీరో సూపర్ హీరోగా కనిపిస్తే... ఆ చిత్రానికి ఎనలేని క్రేజ్ ఉంటుంది. ఆ క్రేజీ ప్రాజెక్ట్‌కి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆమిర్‌ని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ సూపర్ హీరోగా చూపించనున్న సంగతి తెలిసిందే. నిజానికి సూర్య హీరోగా 'ఇరుంబు కై మాయావి' (ఇనుప చేయి మాయగాడు) టైటిల్‌తో చేయాల్సిన కథని ఇప్పుడు ఆమిర్‌తో తీయనున్నారు లోకేశ్. అయితే నాలుగైదేళ్ల క్రితం లోకేశ్ ఈ కథ రాసుకున్నారు. ఆ తర్వాత తాను తెరకెక్కించిన చిత్రాల్లో ఈ స్క్రిప్ట్‌లోని కొన్ని సన్నివేశాలను కూడా ఉపయోగించారు. అలానే వేరే చిత్రాల్లోనూ ఈ కథలోని కొన్ని సన్నివేశాలు పోలినవి ఉన్నాయట. సో... ఈ స్క్రిప్ట్‌ని రీ వర్క్ చేస్తున్నారట లోకేశ్. ముందు అనుకున్నట్లుగానే సూపర్ హీరో మూవీలానే తెరకెక్కిస్తారు. అయితే ముందు అనుకున్న కథలో హీరోకి ఒక చేయి ఉండదు. దాంతో ఇనప చేయి పెట్టించుకుంటాడు. ఆ మెటల్ హ్యాండ్‌తో ఈ సూపర్ హీరో చేసే విన్యాసాలు మామూలుగా ఉండవట. ముందు అనుకున్న కథ ఇది. మరి... ఇప్పుడు కథలో మార్పులు చేర్పులు చేస్తున్నారు కాబట్టి... ఈ కథలో సూపర్ హీరో ఆమిర్ ఖాన్‌కి చేయి ఉంటుందా? లేకపోతే ఇరుంబు కై (ఇనుప చేయి)తో ఈ హీరో ఎలాంటి విన్యాసాలు చేయనున్నారనేది చూడాలి. ఈ కథ మీద వర్క్ చేస్తూనే మరోవైపు కార్తీ హీరోగా 'ఖైదీ' సీక్వెల్‌ని తెరకెక్కిస్తారు లోకేశ్. ఇక రజినీకాంత్ హీరోగా లోకేశ్ దర్శకత్వం వహించిన 'కూలీ' చిత్రంలో ఆమిర్ ఖాన్ ఓ కీ రోల్ చేసిన విషయం తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com